1989లో సాక్షి అనే పక్షపత్రికలో ప్రచురితమైన ఈ ఇంటర్వ్యూని
కౌముది పాఠకుల కోసం పునర్ముద్రిస్తున్నాము



# యండమూరితో చంద్ర



*ఇంపాలా కారులో షికారు కొడుతున్న తెలుగు నవలని, మరుక్షణం ఏమౌతుందోననే 'సస్పెన్స్'లో ముంచి 'వచ్చేవారం కలుస్తానోచ్' అంటూ ఉడాయించేసి, పాఠకుల్ని ఎదురుచూసేలా నిలేసి, తను మాత్రం వెయ్యి కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయిన రచయిత 'యండమూరి వీరేంద్రనాథ్'. (ఒకప్పుడీ రచయిత 'స్లో మూవీ ఆర్ట్ ఫిల్మ్' దర్శకుడు మృణాల్‌సేన్ 'ఒక ఊరి కథ'కు డైలాగ్ రైటర్). ఇంత వేగం ఉన్న రచయితను అంతే వేగంగా విజువలైజ్ చేశాడు ఆర్టిస్ట్ చంద్ర.*

*ఇద్దరూ మంచి మిత్రులు.*

*'ఇమేజినేషన్'కూ, 'విజువలైజేషన్కూ మధ్య అవగాహన ఏరేంజ్‌లో ఉండాలో తెలిసిన ఈ మిత్రులు పిచాపాటీ మాట్లాడుకున్నా 'సాహిత్య కళలే' దొర్లుతాయి. 'సాక్షి' పాఠకుల కోసం చంద్ర, యండమూరితో చేసిన ఇంటర్వ్యూను యథాతథంగా ఇస్తున్నాం.*

చంద్ర: ఏ రకమైన ఇన్‌హిబిషన్స్ లేకుండా... నేటి సాహిత్యం గురించి ఓపెన్‌గా డిస్కస్ చేద్దామని వచ్చాను. కావాలంటే ఈ ఇంటర్వ్యూని ప్రింట్కి ఇచ్చేముందు నీకోసారి చూపిస్తాను.

వీరేంద్ర: నాకు చూపించక్కర్లేదు. చెండాడు.

చంద్ర: రైట్. మొదటి ప్రశ్న. దశాబ్దంగా కథలు, నాటకాలు, నవలలు వ్రాసి ఈ రోజు ఒక స్థాయికి చేరుకున్నావు కదా. ఇవ్వాళ నీ 'స్థాయి' పట్ల నీకు ఎలాంటి తృప్తి ఉంది?

వీరేంద్ర: తృప్తి అనేది రిలెటివ్ టర్మ్. నాటకాలు వ్రాసే రోజుల్లో కాకా హోటల్లో అర్థరాత్రి ఒంటి గంట వరకూ టీ తాగుతూ సాహిత్యం గురించి మాట్లాడుకుంటూ, సాహిత్యానికి పెద్ద సేవ చేస్తున్నామని అనుకునే స్థాయిలో కొంతకాలం ఉన్నాను. అది ఒక రకమైన తృప్తి. పెద్ద పెద్ద సినిమా ఫంక్షన్స్ లో షీల్డ్స్ అందుకోవటం కూడా ఒక తృప్తే. అందుకే తృప్తి ఒక రిలేటివ్ టర్మ్.

చంద్ర: కానీ ఇందులో చిన్న లొసుగు ఉంది.

వీరేంద్ర: ఏమిటి?

చంద్ర: యండమూరి ముందు, వెనుక చాలామంది రచయితలు వచ్చారు. పోయారు. నీకన్నా ముందు నుంచీ రాస్తున్నవాళ్ళూ ఉన్నారు. డబ్బులో, పేరులో నువ్వే నెంబర్ వన్. సరే. అయితే సాహిత్యపరంగా ఇదంతా నీకు నిజంగా తృప్తినిస్తోందా అని.

వీరేంద్ర: డబ్బున్నోడికి రాత్రిళ్ళు నిద్ర పట్టదన్న అభిప్రాయం సామాన్యుడికి తృప్తినిస్తుంది.

చంద్ర: సమాధానం దాటవేస్తున్నావు.

వీరేంద్ర: తృప్తి కోసం ఋషి, ఆనందోబ్రహ్మ, థ్రిలర్లాంటి నవలలు వ్రాశాను. రాబోతున్న 'చీకట్లో సూర్యుడు' కూడా అలాంటిదే. కానీ వ్రాయకూడదు. ఎందుకంటే ఇలాంటివి ఇంకో అయిదారు వ్రాస్తే గన్‌షాట్‌గా పాఠకుల ఎక్స్‌–పెక్టేషన్, తద్వారా పాపులారిటీ తగ్గిపోతుంది. పాఠకుల కోసం/ఎడిటర్ల కోసం పాపులర్ నవలలు వ్రాయాలి. నీకో విషయం తెలుసా? ఆనందో బ్రహ్మ సీరియల్ అయిదు వారాల తరువాత ఎడిటర్ ఆపెయ్యమన్నాడు.

చంద్ర: కానీ పల్ప్ సాహిత్యం...

వీరేంద్ర: అవును. నాకు తెలుసు. సాధారణ పాఠకులు తమని stimulate చేసే మరో కొత్త రచయిత రాగానే jump చేసి వెళ్ళిపోతారు. పాతికేళ్ళ తరువాతే ఆనందో బ్రహ్మ నిలబడుతుంది. మరోలా చెప్పాలంటే 125% ఐ. క్యూ. వాళ్ళ కోసం వ్రాసిన నవలలే నిలబడతాయి. వాళ్ళే ఆ నవలల్ని వచ్చే తరాల కోసం నిలబెడతారు. కాబట్టి I have to choose between two alternatives. ఎక్కువమంది కోసం తాత్కాలికంగా వ్రాయాలా? లేదా తక్కువ మంది కోసం చరిత్రలో నిలబడే రచనలు చెయ్యాలా? దీనికీ – దానికీ మధ్య వంతెన వేసుకుంటూ రాస్తున్నానని అనుకుంటున్నాను. 'కనీసం' అనుకుంటున్నాను. నా అభిప్రాయం తప్పో ఒప్పో తెలీదు.

చంద్ర: ఇది మంచి నవల, ఇది పాపులర్... అని రచయితకి ముందే తెలుస్తుందా?

వీరేంద్ర: నాకు తెలుస్తుంది.

చంద్ర: మరేం చేస్తావ్?

వీరేంద్ర: 'ప్లీజ్... ప్లీజ్' అని ఎడిటర్లని బ్రతిమాలుకుంటాను. ప్రార్థన, ఆనందోబ్రహ్మ ఆపొద్దని అలానే బ్రతిమాలాను.

చంద్ర: 'గుండె క్రింద తడిని తాకటం లేదా కదిలించటం ఇవాళ్టి రచయితలు చాలామందికి తెలీదు. చేతకావటం లేదు కూడా. వెన్నెల్లో ఆడపిల్ల, ప్రార్థన, నల్లంచు తెల్లచీర, వెన్నెల్లో గోదారి... వీటిల్లో, చివరికి 'తులసి దళం' నవల తీసుకున్నా, చాలా సందర్భాల్లో ఈ 'గుండె కింద తడి', అంటే పాఠకుల మనసు లోతుల్ని తట్టే సెన్సిటివ్ ఫీలింగ్స్‌ని చాలా చక్కగా, కొండొకచో అద్భుతంగా కూడా వ్రాసావు.

వీరేంద్ర: వీపు గోకకు. ప్రశ్నలు అడుగు.

చంద్ర: (నవ్వు) కారం జల్లే ముందు గోకాలిగా. వస్తున్నా. జీవితం పట్ల ఇంత అవగాహన, పరిశీలనా ఉన్న నువ్వు ఇలా థ్రిల్లర్స్ కాకుండా సాహిత్యంలో నిలిచిపోయే సామాజిక రచనల్నీ, సీరియస్ నవలల్నీ ఎందుకు ఎక్కువ వ్రాయవు?

వీరేంద్ర: నా మొదటి రచన 'గులకరాళ్ళు – గులాబిముళ్ళు' వ్రాసిన రోజు నుండీ నేన్నీకు తెలుసు.

చంద్ర: ఆ రోజూ, ఈ రోజూ పాఠకుల స్థాయి అదే.

వీరేంద్ర: వారి స్థాయి కాదు. నా స్థాయి మారిందంటున్నాను. నాలుగు సినిమాలు, అయిదు షూటింగులూ, మూడు నవలలూ, ఇంటర్వ్యూలు ఈ హడావుడిలో నేను ఆ 'తడి' ఆస్పెక్ట్‌లో ఇన్ని రాయలేను. ఈ ఆర్ద్రత, స్పందన అన్నవి పెట్టుకుంటే – హి విల్ బికం ఎ గుడ్ రైటర్! బట్ నాట్ ఎ కమర్షియల్ రైటర్!

చంద్ర: అంటే... పాఠకులు రచయితని 'డ్రైవ్' చెయ్యటం అంటూ ఏమీ ఉండదు.

వీరేంద్ర: ఎవరైనా రచయిత 'నేను పాఠకులని పైకి తీసుకురావటం కోసం వ్రాస్తున్నను' అనుకుంటే, అంతకంటే ఆత్మవంచన మరోటి లేదు.

వీరేంద్ర: తమకేమి కావాలో పాఠకులకు తెలుసు.

చంద్ర: రచయితే తన పాఠకుల్ని ఎన్నుకుంటాడు.

చంద్ర: అలా అయితే పాఠకులు నిశ్చయంగా మత్తు కోరుకుంటారు.

వీరేంద్ర: కోరుకోరు. నా రచనల్లో వాయిలెన్స్, సెక్స్ ఉండదు. 'ఆరోగ్యం' ప్లస్ 'ఆనందం'. దీనికి మత్తు అని పేరు పెడతానంటే నాకెమీ అభ్యంతరం లేదు.

చంద్ర: కానీ నీలాగా పేరున్న రచయితకి ఒక ఫెయిల్యూర్ ఉన్నప్పటికీ మరో రచనలో నిలదొక్కుకునే అవకాశం ఉంది కదా.

వీరేంద్ర: అవును. అందుకే పర్ణశాలతో ఫెయిల్ అయి, తులసిదలంతో సక్సెస్ అయి, ఆనందోబ్రహ్మతో ఫెయిలయి, వెన్నెల్లో ఆడపిల్లతో సక్సెస్ అయి, ప్రార్థనతో ఫెయిలయి అభిలాషతో సక్సెస్ అయి, ఇలా ఫెయిల్.. సక్సెస్ అవుతున్నాననే అనుకుంటున్నాను.

చంద్ర: కానీ నువ్వు ఫెయిల్ అనుకున్న నవలలే భవిష్యత్ చరిత్రలో నిలబడతాయి చూస్తూ ఉండు.

వీరేంద్ర: దానికి ముందు నేను వర్తమానంలో నిలబడాలి కాదా.

చంద్ర: నిలబడటం అంటే?

వీరేంద్ర: మా పత్రికకి ఒక సీరియల్ వ్రాయండి... అని ఎడిటర్లు అడగటం.

చంద్ర: ఇలా ఒక మంచి నవల, ఒక చెడు నవల...

వీరేంద్ర: చెడు నవల ఏమిటీ? కమర్షియల్ నవల అను.

చంద్ర: ఐ.క్యూ. ఎక్కువ ఉన్న పాఠకులకి చెడు నవలే కదా.

వీరేంద్ర: రైటర్స్ రెండు రకాలుగా ఉంటారు. రీడర్స్ రైటర్స్, రైటర్స్ రైటర్స్. ఈ రెండో రకం రచయితలు మేధావులుగా పరిగణింపబడతారు.

చంద్ర: కరెక్ట్ గా నా దారికి వచ్చావు. చాలా సందర్భాలలో నువ్వు శ్రీశ్రీ నో, కృష్ణశాస్త్రినో, తిలక్‌నో, కరుణశ్రీనో, కుటుంబరావునో, చలాన్నో... వాళ్ళ పేరాల్నిగానీ, కవిత్వాన్నిగానీ నీ నవలల్లో కోట్ చేశావు. అలాంటప్పుడు నువ్వు రాస్తున్న సాహిత్యం నీ తర్వాత రచయితలు కూడా కోట్ చేసే స్థాయిలో ఉండాలని నువ్వు అనుకోవటంలేదా?

వీరేంద్ర: నేను పోయాక కోట్ చేస్తారేమో.

చంద్ర: నేటి మన తెలుగు రచయితలు చాలామంది జీవనవిధానానికి సంబంధించి కథల్ని, కథావస్తువుల్ని, పాత్రల్ని చివరికి మనస్తత్వాన్ని కానీ వ్రాయటం లేదు. వీటిలో ఏదీ తెలుగు కాదు. చివరికి వాక్యాలు కూడా తెలుగేనా? అన్నంత స్థాయిలో ఉంటున్నాయి.

వీరేంద్ర: దీనికి కారణం చెప్పమంటావా? తులసిదళం! కేవలం తులసిదళం! తెలుగు సాహిత్యంలో ఒక ట్రెండ్‌ని బద్దలు కొట్టటానికి 'తులసిదళం' ద్వారా ప్రయత్నించాను. కేవలం అదే పద్ధతిలో వ్రాయటానికి ఇవాళ్టి రచయితలు సెక్సూ, క్షుద్రం, వాయిలెన్సు, క్రైం, పాములు, పునర్జన్మలు ఇలా పదిరాళ్ళు విసురుతున్నారు. ఒక్కటైనా తగలకపోతుందా అన్నది వాళ్ళ అభిలాష.

చంద్ర: ఇలా చేయటం మంచా? చెడా?

వీరేంద్ర: ఇందులో కొన్ని మంచి, కొన్ని చెడు రాళ్ళుండొచ్చు. చెప్పటానికి నేనెవర్ని? ఒకరు సెక్స్ విపరీతంగా రాసి పాఠకుల్ని ఆకట్టుకుంటే, ఇంకొకరు వారధి, ఏటి ఒడ్డున నీటిపూలు లాంటివి పాత పద్ధతిలో వ్రాసే ప్రయత్నం చేయొచ్చు. రచన బావుంటే పాఠకులు రిసీవ్ చేసుకుంటారు. బాలేకపోతే రిజెక్ట్ చేస్తారు.

చంద్ర: ఈ మధ్యకాలంలో నేను గమనించింది ఏమిటంటే ఈ పబ్లిషర్స్ ఉన్నారే వాళ్ళు రచయితల్ని – ఇంకో నాలుగు నవలలు ఎక్కువ అమ్ముకోవటానికి 'బ్రాండ్' నవల్ని రాయమని అప్రోచ్ అవుతున్నారని.

వీరేంద్ర: ప్రజలకి కావలసింది ఏమిటో తెలుసుకోవటం కోసం ఒక రచయిత పబ్లిషర్స్ మీద ఆధారపడ్డాడంటే అతను అసలు రచయితే కాదని నా ఉద్దేశ్యం. పత్రికాధిపతులంటావా? తమ పత్రికలో ఒక సెక్స్ సీరియల్, ప్రక్కనే ఒక సెంటిమెంట్ నవల, దాని తర్వాత క్రైం సీరియల్ బావుంటుందని ఉద్దేశ్యం కావచ్చు.

చంద్ర: అంటే ఈ రోజున రీడర్స్ ఉన్న స్థాయికి ఇన్‌డైరెక్ట్‌గా ఎడిటర్సే కారణం అన్నమాట.

వీరేంద్ర: స్థాయి ఏమిటి? తెనాలి రామకృష్ణుడు, శ్రీనాథుడు, కాళిదాసూ కాలం నుంచీ ఇవాళ్టి వరకూ పాఠకులు ఎప్పుడూ ఒకే రకంగా ఉన్నారు. ఉంటారు. పాతికేళ్ల తరువాత, అంటే 2015 సాహిత్య చర్చల్లో "1990ల్లో సాహిత్యం చాలా బాగుండేది. ఇప్పుడిలా పాడయిపోయింద"ని బాధపడతారేమో ఆలోచించు. 1960 దశకంలో గోపీచంద్, కొడవంటిగంటిని కూడా ఇలాగే విమర్శించారు. ఆ విషయం వారి రచనల "ముందుమాట"లు చదివితే తెలుస్తుంది. ఆరోజుల్లో వాళ్ళు ఎంతెంత బాధపడ్డారో పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా లో గోపీచంద్ సజ్జల విసర్జన, సాహితీ బహుమతుల గురించి చెపుతాడు కదా.

చంద్ర: నీ ఉద్దేశ్యంలో రచయితలు ఎలా ఉండాలంటావు?

వీరేంద్ర: రచనా వ్యాసంగం నుంచి తప్పుకున్నాక 'సాహిత్యం భ్రష్టు పట్టిపోయింది' అనకుండా ఉంటే చాలు. నాటకలు వ్రాయటం మానేశాక వాటి గురించి ఎప్పుడూ కామెంట్ చేయలేదు.

చంద్ర: తమ అనుభవాన్ని పురస్కరించుకుని కామెంట్ చేయవచ్చు కదా.

వీరెంద్ర: ఏ అనుభవాన్ని? "మేమున్నన్న రోజుల్లో" ఏమిటి? వాళ్ళు రచనలు చేసినప్పుడు సాహిత్యం బాగుందా? వాళ్ళు మానేశాక చెడిపోయిందా?

చంద్ర: నువ్వు నాటకాలు రాయటానికి పూర్వం పోటీ ఓరియెంటెడ్‌గా ఉండేవి. 'గులకరాళ్ళు – గులాబీముళ్ళు', 'కుక్క', 'రుద్రవీణ', 'రఘుపతి రాఘవ రాజరాం' లాంటి వాటిల్లో ఒక ట్రెండ్ ప్రారంభించావని అనుకుంటున్నాను. ఆరోజుల్లో నీకు ఒక నవలా రచయిత మిత్రుడు కనిపించి నాటకాలు రాయటం సులువనీ, నవల రాయటం కష్టమనీ అంటే నువ్వు వెంటనే నవలలు రాయటం ప్రారంభించానని ఎక్కడో చెప్పావు. నాటకం కన్నా నవల రాయటం కష్టమా?

వీరేంద్ర: నాటకం రాయటం కన్నా నవల రాయటం నిశ్చయంగా సులువు.

చంద్ర: మరి ఆ రచయిత మిత్రుడి అభిప్రాయం...

వీరేంద్ర: నేను రెండూ చూసాను. అతను ఒకటే చూశాడు.

చంద్ర: నీ మీద క్రిటిసిజం ఏమిటంటే, అసలు ఈ వీరేంద్రనాథ్‌కి సైన్సు ఎలా తెలుసు? ఏ అధికారంతో 'చీకట్లో సూర్యుడు' వ్రాస్తున్నాడు?' అని.

వీరేంద్ర: ఏ స్థాయి సైన్స్ స్టూడెంట్‌నయినా రమ్మను. అతన్ని నేను ఓ పది ప్రశ్నలూ, నన్ను అతను ఒక పది ప్రశ్నలు వేసుకుంటాం. ఎవరెన్నింటికి జవాబు చెబుతారో చూద్దా గాని.

చంద్ర: ఇప్పుడు రాస్తున్న నాలుగు నవలల బదులు, జీవితం తాలూకు సీరియస్‌నెస్‌ను తీసుకుని ఇవాళ్టి పాఠకులకి రెండు నవలల్ని కష్టపడి, ఇష్టపడి రాయొచ్చు కదా?

వీరేంద్ర: ఎందుకు?

చంద్ర: ఒక ఆర్తి కోసం

వీరేంద్ర: మూడు పాపులారిటీ కోసం, ఒకటి ఆర్తి కోసం వ్రాస్తున్నా గదా!

చంద్ర: ఈ మూడు నవలలూ ఆ నాలుగో దాన్ని డామినేట్ చేసే ప్రమాదం ఉంది!

వీరేంద్ర: కాదు. ఆ మూడూ చదివిన పాఠకులు ఈ నాలుగో నవలని కూడా చదువుతారు. ఏ రచయిత అయినా తన మంచి నవలని ఎక్కువ మంది పాఠకులు చదవాలనుకుంటాడు. నా పద్ధతిలో ముందు ఎక్కువ మందిని ఆకర్షించి వాళ్ళని మన వైపు తిప్పుకోవటం ఒక పద్ధతి. మంచో, చెడో తెలీదు కానీ అలా ప్రయత్నిస్తున్నా. ఓ ప్రశ్నకి సమాధానం చెప్పు. ఓ. హెన్రీ, మామ్ లాంటి రచయితలు నిశ్చయంగా గొప్ప రచయితలంటారు గదూ!

చంద్ర: అవును.

వీరేంద్ర: కదా..! మరి షిడ్నీ షెల్డన్, ఆర్థర్ హెయిలీ...వీళ్ళు?

చంద్ర: వారూ మంచి రచయితలే. వీళ్ళ రచనలు కూడా కొంత జ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవటానికి ఉపయోగపడేవే. కానీ జీవననడవడి మార్చుకోవటానికి గానీ, మంచి నేర్చుకోవటానికి గానీ ఉపయోగపడవేమోనని నా అభిప్రాయం.

వీరేంద్ర: కమర్షియల్ రచనలో పర్సెంటేజ్ ఆఫ్ డ్రామా ఎక్కువ ఉంటుంది.

చంద్ర: అవును!

వీరేంద్ర: పాఠకుల రుడిమెంటరీస్ మీద ఎక్కువ 'ప్లే' ఉంటుంది. దాన్నే మీరు చెత్త అంటున్నారు.

చంద్ర: సిడ్నీ షెల్డన్ నవలలు చెత్త అని నేనెపుడూ అనలేదు.

వీరేంద్ర: మరి మా నవలల్ని ఎందుకు అంటున్నారు?

చంద్ర: ఎందుకంటే, మాకు తెలీని జీవితం అదంతా. వీటిల్లో జరిగే కథగానీ, పాత్రలుగానీ, స్వభావాలుగానీ అంతా డ్రామా. మాకు ఏమీ తెలీదు. అందుకని వీటిని మేము own చేసుకోలేకుండా ఉన్నాము.

వీరేంద్ర: తెలిసిన ప్రపంచం గురించి రాస్తే పాఠకుడు ఎందుకు చదువుతాడు? నువ్వు నా లేటెస్ట్ నవల మంచు పర్వతం చదివావా? పెద్ద ఫ్లాపు.

చంద్ర: లేదు. నీ ఒక్కడి గురించి కాదు. ఇవాళ్టి రచయితల గురించి. తెలిసిన ప్రపంచం అయినా తను చూడని కోణాల్ని, చూడని విధానాల్ని గురించి రాయొచ్చు కదా.

వీరేంద్ర: ఉదాహరణకి ఒక మర్డర్‌నే తీసుకుందాం. దీన్ని రెండు రకాలుగా రాయొచ్చు. ఈ హత్య వల్ల సామాన్యుడి జీవితం ఎలా ఎఫెక్ట్ అయిందో ఒక రకం. హత్య ఎలా, ఎందుకు జరిగిందో చెప్పటం రెండో రకం. నేను ఎక్కువ మంది పాఠకుల్ని ఆకట్టుకోవటం కోసం ఆ మాఫియా లీడర్ ప్రైవేట్ లైఫ్ గురించీ, వాడి జీవితం గురించీ రాసి సామాన్యుడి జీవితాన్ని మధ్యలో కొంత రాస్తాను. నేను చేసేది కమర్షియల్ నవల అవుతుంది. సామాన్యుడి పరంగా ఇదే కథ రాస్తే మంచి నవల అవ్వొచ్చు. కానీ నేను రాసేది intoxicating ఉంటుంది.

చంద్ర: ఈ రెండు విధానాల్నీ కలగలిపి ఇంకో రకంగా...

వీరేంద్ర: ఈ రెండు ప్రక్రియలూ కలవవు. అలా సాధ్యమయి ఉంటే షేక్స్పియరే అలా వ్రాసి ఉండేవాడు.

చంద్ర: అవును. ఆయుర్వేదం ఆయుర్వేదమే. అలోపతి అలోపతియే. సరే ఆ టాపిక్ వదిలిపెట్టు. నువ్వు 'దున్నపోతులు' అన్న నవల రాశావు. నాకు బాగా నచ్చింది. ఎందువల్లో అది ఏ పత్రికకీ పంపలేదు.

వీరేంద్ర: అవును. తెలంగాణాలో తిరుపతిని డామినేట్ చేసే గుడి కట్టటం గురించి వ్యంగ్య రచనది.

చంద్ర: ఆ స్క్రిప్ట్ నా దగ్గరే ఉంది. అలాంటి మంచి నవలని నువ్వు...

వీరేంద్ర: తప్పకుండా తిరగ రాస్తాను. నన్నొదిలెయ్. చెప్పు. నేను వ్రాసినా, మేధావులూ వ్రాసినా... మంచి నవలంటే చదివించేదేనా?

చంద్ర: అవును.

వీరేంద్ర: మరయితే ఒక మంచి నవల వస్తే ఎడిటర్స్ ఎందుకు పబ్లిష్ చేయరు? తప్పకుండా చేస్తారు. ఇంతమంది రచయితలున్నారు గదా. వేదికలెక్కి విమర్శిస్తున్నారు గదా. మరి ఏ ఒక్కళ్ళు గూడా ఒక మంచి చదివించే నవల రాయటం లేదేం? ఎడిటర్స్‌ని అడిగితే రావటం లేదంటారు. నేను ఎడిటర్స్‌ని నమ్ముతాను. మంచి రచయితలనుకునేవారు, చదివించే రచనలు చేయటం లేదు. కూడబలుక్కుని చెదివే నవలే మంచి రచన, సస్పెన్సూ, థ్రిల్లూ, చదివించే గుణం ఉంటే అది మంచి రచన కాదూ అనుకుంటే ఎలా?

చంద్ర: నువ్వు నీ రచనల ద్వారా సంఘానికి చేసిన మంచీ, మేలూ ఏమీ లేదని నీ విమర్శకులు అంటారు.

వీరేంద్ర: గీతా కేఫ్ లో ఇడ్లీ బావుంటుంది. వెళ్దామా. హానీ చేయ్యదూ, మేలూ చెయ్యదు. బావుంటుంది.

చంద్ర: టాపిక్ మార్చకు.

వీరేంద్ర: నా ఉద్దేశ్యంలో ఏ రచయితయినా సంఘాన్ని మార్చటానికి రచనలు చేయకూడదు. వ్యక్తుల్ని మార్చటానికి రచనలు చేయాలి.

చంద్ర: వ్యక్తుల సమూహమే కదా సమాజం!

వీరేంద్ర: వ్యక్తుల్లో స్వశక్తి, కృషి, ఆత్మస్థైర్యం ఇవన్నీ కలిగించటానికే నేను నా పాత్రల్ని రాస్తున్నాను. నా నవలల్లో ఏది చూసినా ఇదే కనిపిస్తుంది.

చంద్ర: మా పెయింటింగ్స్ తాలూకు మంచి చెడ్డల్ని చెప్పటానికి ఆర్ట్ క్రిటిక్స్ ఉన్నట్టు నవలల్లోని గుణగణాలని విడమర్చేందుకు...

వీరేంద్ర: తెలుగులో అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మంచి క్రిటిక్స్ లేరు. రాయటం మానేసిన వాళ్ళందరూ క్రిటిక్స్ అవుతున్నారు. ఒక నవలని రివ్యూ చేయాలంటే ఆ రివ్యూని మూడు పేరా గ్రాఫులుగా చేసి, మొదటిదాంట్లో ప్రొ నావెల్, రెండో దాంట్లో అగెనెస్ట్ ది నావెల్, మూడో దాంట్లో అభిప్రాయం వ్రాయాలి.

చంద్ర: సెక్స్ అండర్గ్రౌండ్ మాఫియా, మాయలూ, పిస్తోళ్ళూ, హత్యలూ... ఇట్లాంటి థ్రిల్లింగ్, సస్పెన్స్ పద్ధతుల్లో నవలలు వస్తున్నాయి కదా. అదే థ్రిల్ తో, సస్పెన్స్‌తో ఒక రిక్షావాడి జీవితం గురించో, మరోదాని గురించో కూడా రాయొచ్చునా?

వీరేంద్ర: రాయొచ్చు. దాన్ని కూడా కమర్షియల్ అంటారు. మంచి రచనలో 'థ్రిల్' ఉండకూడదని మేధావుల ఉద్దేశ్యం. అసలు విషయం చెపుతా విను. కాంటెంపరరీ సాహిత్యంలో పార్లల్ ట్రాక్ లేకపోవటానికి బాధ్యులం మేము కాదు. మమ్మల్ని విమర్శించే వాళ్ళు. ఆ పారలెల్ ట్రాక్ బిల్డప్ చేయటానికి బదులు ఈ ట్రాక్ మీద రాళ్ళు వేయటానికి ప్రయత్నిస్తున్నారు. పాపులర్ నవలలు పాఠకులని చెడగొడుతున్నాయని ఓ విమర్శ. ఏ ఒకరో ఇద్దరో మెంటల్ బ్యాలెన్స్ లేనివాళ్ళు చెడిపోతారేమో. అయినా చెడిపోవటం అంటూ జరిగితే ఏ సినిమానో, టి.వి.నో చూసి కూడా చెడిపోవచ్చు. అవునా కాదా?

చంద్ర: అవును.

వీరేంద్ర: మరటువంటప్పుడు సాహిత్యం దిగజారిపోయిందని ఎందుకనుకుంటున్నారు? చాలామంది పాఠకులు నిజానికి మాకన్న తెలివైనవాళ్ళే. అందులో ఎక్కువ శాతం బూతు పత్రికలూ, సెక్స్ కథలూ చదవరు. డిటెక్టివ్‌లు చదవరు. అయినా నా నవలలంటే ఇష్టపడతారు. చదువుతారు. కేవలం సస్పెన్సూ, థ్రిల్లరూ రాస్తానని మటుకు కాదు.

చంద్ర: భవిష్యత్తులో  పాపులర్ సాహిత్యం ఎలా ఉండబోతుంది

వీరేంద్ర: ఏమీ ఉండదు

చంద్ర: ఏమి మాట్లాడుతున్నావు నువ్వు?

వీరేంద్ర: స్వతంత్రం వచ్చిన కొత్తలో సామాన్యుడి జీవితం గురించి ఆనాటి రచయితలు అసాధారణ రచనలు చేశారు. ఆ తర్వాత రచయిత్రుల కాల్పనిక ఆకర్షిత సాహిత్యం వచ్చింది. ఆపై మనోవికాసంతో కూడిన మరో రకం పాపులర్ రచన వచ్చింది. ఇక్కడితో ఇది ఆగిపోయింది. మరో రచయిత గానీ రచయిత్రి గానీ వచ్చి ట్రెండ్ సెట్ చేస్తే పాపులర్ నవల ఇంకో తరం పాటు నిలబడుతుంది. లేదంటే వారపత్రికలు గానీ, మాస పత్రికలు గాని భవిష్యత్తులో ఉండవు. 'మా పుస్తకం చదవండి. మా కథ చదవండి ప్లీజ్' అని రచయితలు రచయిత్రులు ఫ్రీగా వదలసిందే. పది రూపాయలు పెట్టి పుస్తకం కొంటే దానికి సరిపడా సంతృప్తి రావాలి కదా.

చంద్ర: అలాంటి మరో రచయిత భవిష్యత్తులో వస్తారని ఆశిస్తూ సెలవు

Click here to share your comments on this story